

ఏకధాటిగా వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో రెండు రోజులుగా తెరిపి లేకుండా రెండు రోజులుగా వర్షం కురుస్తుంది. ముసురుతో కూడిన వర్షంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కించుమండ సంతబయలులో బుధవారం జరిగిన వారపుసంతలో నిత్యావసరాల సరుకులు కొనడానికి, అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి వచ్చిన గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. అరకు- పాడేరు ప్రధాన రహదారిలోని కుసుమగుడ హైవే రోడ్డు చిత్తడిగా మారింది. వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. బురదయంగా మారిన ప్రాంతంలో గ్రావెల్ వేసే విధంగా హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కురుస్తున్న వర్షం

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

జిసిసి ఎమ్‌డి కల్పనా కుమారి



మాట్లాడుతున్న జిసిసి ఎమ్‌డి కల్పనాకుమారి

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర అందించమే లక్ష్యమని జిసిసి ఎండి కల్పనా కుమారి స్పష్టం చేసారు. బుధవారం ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కాఫీ అధికారులు, కాఫీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాఫీ రైతులకు జిసిసి నుండి రుణాలు అందిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో కాఫీ సిబ్బందితో జిసిసి సిబ్బంది కలిసి పని చేయాలని చెప్పారు. ఏజెన్సీలో కాఫీ కొనుగోలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారుల గురించి అడిగి తెలుసుకున్నారు. మాక్స్ సంస్థ ద్వారా మూడు వేల మెట్రిక్ టున్నుల కాఫీ సేకరకు మాక్స్ సంస్థకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ప్రతీ సంవత్సరం జిసిసి ఐదు వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుండి జిసిసి, ఐటిడిఏ సంయుక్తంగా కాఫీ కొనుగోలు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కాఫీ రైతులతో మాట్లాడి కాఫీ ఉత్పత్తులు, రైతులు పొందుతున్న కాఫీ ధరలను అడిగి తెలుసుకున్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ సాగుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నుల కాఫీ పండ్ల సేకరణలో లక్ష్యంగా నిర్దేశించుకుని 700 మెట్రిక్ టన్నుల కాఫీని మాక్స్ ద్వారా సేకరించామన్నారు.జి.మాడుగుల, జి.కె. వీధి మండల కేంద్రంలో రెండు ఎకోపల్పింగ్ యూనిట్ల నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సంలో 16 వేల ఎకరాల్లో కాఫీ తోటలను పెంపకం చేయడం జరుగుతోందన్నారు.అనంతరం అరకువ్యాలీ మండల కేంద్రంలో ఉన్న సబ్బుల తయారీ యూనిట్ను పరిశీలించారు ఆ తరువాత నాంది ఫౌండేషన్ కాఫీ సేకరణ యూనిటు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికాలు వి. ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, జిసిసి సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, పాడేరు డి.ఎం. సింహాచలం, కాఫీ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు కార్మికులు ఐక్యంగా ఉండాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం అరకువేలి ఆధివాసి గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన ప్రాంత ఉద్యమ నాయకుడు, సిఐటియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన కామ్రేడ్ ఎం సూర్యనారాయణ పదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కామ్రేడ్ సూర్యనారాయణ గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించారని తెలిపారు. విద్యుత్ ఉద్యమం, బాక్సైట్ ఉద్యమం,1/70 పరిరక్షణకై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు.ఆయన మరణం గిరిజన ప్రాంత ఉద్యమానికి తీరని లోటన్నారు. సూర్యనారాయణ కడ వరకూ ప్రజల సమస్యలపై పోరాటలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు బుజ్జి బాబు, జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

9న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో రక్తపు నిలువలు లేక పోవడంతో గర్భిణీలు, రక్తహీనత కలిగిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లాలోని చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోనూ, పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో ఏకకాలంలో 9వ తేదీన అత్యవసర రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదాతలు అవగాహన కలిగి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సురేంద్ర

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని జామిగూడ పంచాయితి జమిగూడ-గుంజివాడ మధ్య వంతెన నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ వంతెన నిర్మాణంతో జమీగూడ, గిన్నెలకోట, ఇంజేరి పంచాయితి కి చెందిన 80 గ్రామాల ఆదివాసీలకు రవాణా సాదుపాయం కలుగుతుందన్నారు. వంతెన ఏర్పాటు చేయాని డిమాండ్ చేస్తూ గుంజీవాడ గెడ్డ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన దర్మన్న పడల్, మాజీ జిల్లా అధ్యక్షులు బొండ సన్నిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె .నర్సయ్య హాజరయ్యారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గుంజీవడ -జామిగుడ వంతెన నిర్మాణం పూర్తి చేసినట్లయితే 80 గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. 2022లో అప్పటి వైసిపి ప్రభుత్వం 2 కోట్లతో వంతెన నిర్మాణనికి శంకుస్థాపన కూడా చేశారని, నేటికీ రెండేళ్లు గడిచినా నిర్మాణం పూర్తి కాలేదన్నారు.వర్షాకాలంలో ఆదివాసీలు పెన్షన్లు, నిత్యావసర వస్తువులు తీసుకుని వెళ్ళుటకు గెడ దాటుతున్నారని, అనారోగ్యం వచ్చిన వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వంతెన నిర్మాణం చేసి రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పప్పుల బుజ్జిబాబు, జమిగుడ గ్రామస్తులు కొర్ర మంగ్లాన్న పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



ఎన్నికల పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:ఉమ్మడి విశాఖ జిల్లలో స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఈ నెల 30వ తేదీన ఎన్నిక జరగనున్న నేపధ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉన్న పాడేరు డివిజన్ 11 మండలాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం జేసి ఎంజే అభిషేక్ గౌడ్, ఎస్పి అమిత్ బర్దార్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా మండలాల ఎంపిడిఓలు ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులుగా, తహసిల్దార్లు మండల మేజిస్ట్రేట్లుగా వ్యవహరించాలని ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఈ నెల ఆరవ తేదీన నోటిఫికేషన్ జారీ అయ్యిందని, 30వ తేదీన పోలింగ్ ఉంటుందని, సెప్టెంబర్ మూడవ తేదీన కౌంటింగ్ ఉంటుందని, ఆరవ తేదీ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. అంతవరకూ 11 మండలాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని, దినపత్రికలలో వచ్చిన వార్తలపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. 11 మండలాలలో ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, శాసనసభ్యులు, కో ఆప్షన్ సభ్యులు 177 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, వారికోసం పాడేరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి ప్రసంగాలు లేకుండా తొమ్మిదవ తేదీన జరగనున్న ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు.

ఎస్పి అమిత్ బర్దార్ మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేస్తామని, రెవెన్యు, పోలీస్ పరస్పర సహకారంతో ఎఫ్.ఎస్.టి, ఎస్ఎస్‌టి బృందాలు నిఘా పెట్టాలని ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలపై నిఘా పెట్టి తగు చర్యలు తీసుకుంటామని, కోడ్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసి ఎం.జే అభిషేక్ గౌడ్, 11 మండలాల ఎంపిడిఓలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు అప్పగించండి

పాడేరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూములను త్వరితగతిన ఖాళీ చేసి విద్యార్థులకు అప్పగించాలని, వారి విద్యకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం డిగ్రీ కళాశాల లోని స్ట్రాంగ్ రూముల శీల్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరచి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి, ఎస్డిసి వివిఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.-

మన్యంలో కుంభవృష్టి...
స్తంభించిన జనజీవనం

ఉప్పొంగిన కొండవాగులు, గెడ్డలు
రోడ్లుపైకి, జనావాసాల్లోకి వర్షపు నీరు
రాకపోకలకు మన్యవాసుల ఇక్కట్లు
భయం గుప్పెట్లో ముంపు బాధితులు



విఆర్.పురంలో చేయిచేయి కలిపి గుంపుగా అన్నవరం వాగు దాటుతున్న కూలీలు

అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రోజంతా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. కుంభవృష్టి వర్షాలకు కొండవాగులు, వంకలు ఉప్పొంగడంతో రోడ్లుపైకి వర్షపునీరు భారీగా చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇళ్లల్లోంచి కాలు బయటపెట్టలేనంతగా వర్షం కురవడంతో జనజీవనం స్థంభించింది. వీడకుండా కురుస్తున్న వర్షాలతో స్వల్పంగా గోదావరి నీటిమట్టం పెరగడంతో ముంపు బాధితుల్లో ఆందోళన నెలకొంది.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఎటపాక : మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి చెరువులు అలుగు పారుతున్నాయి. కుంటలు నిండుకుండల తయారయ్యాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వారం రోజులుగా ముమ్మురంగా వేస్తున్న వరి నాట్లకు, మిరప నారుమడులు, వ్యవసాయ పనులకు భారీ వర్షంతో బ్రేక్ పడింది. మరో రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికతో అధికారులు అప్రమత్తమయ్యారు. నీటిలోకి ప్రజలు ఎవరూ వెళ్లొద్దని, చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. భారీ వర్షానికి తోడు ఎగువ నుండి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34 అడుగులు దాటి ప్రవహిస్తుంది. గోదావరి నీటిమట్టం మరింత పెరుగుతుందనే సమాచారంతో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు.

విఆర్ పురం: మండలంలోని రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు, పొంగటంతో జనజీవనం స్తంభించింది మండలంలో శ్రీరామగిరి నుండి ముద్దుల గూడెం మధ్యలో వాగు పొంగటంతో నాలుగు గ్రామాలు ప్రజలు రాకపోకలు ఆగిపోయాయి. అన్నవరం ఉమ్మడివరం గ్రామం మధ్యలో వాగు పొంగటంతో సుమారుగా 40 గ్రామాలు రాకపోకలు నిలిచిపోయాయి.చింత రేగుపల్లి, సృష్టివారి గూడెం గ్రామం మధ్యలో రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో ఏడు గ్రామాలు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద తగ్గుముఖం పట్టి, ఇళ్లకు చేరుకున్న ముంపు బాధితులు బురద పట్టిన ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న పరిస్థితుల్లో, మళ్లీ కుండపోత వర్షంతో బాధితుల్లో అలజడి మొదలైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మధ్యాహ్నం మూడు గంటలకు 34.8 అడుగులకు చేరవడంతో ఇంకెన్నాళ్లు పునరావాస కేంద్రాల్లో ఉండాలోయని వరద బాధితులు ఆందోళన చెందుతున్నారు.

దేవీపట్నం : భారీ వర్షాలకు మండలంలోని ఇందుకూరుపేట ఎం.రావిలంక మధ్య ఇనుకొండ వాగు తెల్లవారుజామున ఉప్పొంగి ప్రవహించడంతో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎం రావిలంక పోతవరం, పోతుకొండ, దేవారం. శరభవరం, ముసునగుంట కాలనీ, సీతారాం కాలనీ, చిన్నారి గండి కాలనీ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

చింతూరు. : కుండపోత వర్షంతో చింతూరు మండలంలోని సోకిలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. బుధవారం చింతూరు వారపు సంత కూడా జనం లేక వెలవెలబోయింది. 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షంతో కాలు బయటపెట్టలేని స్థితి ఉంది. వర్షంతో డ్రైనేజీలు ఉప్పొంగడంతో మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని అంతర్గత రహదారులు నీటితో నిండి బురదమయంగా మారినాయి. ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. బిసి, ఎస్‌టి కాలనీల్లో వర్షపు నీటితో నిండిపోవడంతో వాగులు, చెరువులను తలపిస్తున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిపిఎం

విఆర్ పురం: ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ కోరారు. కొండవాగులు, వంకలు, ఉప్పొంగి ప్రవహించడంతోపాటు చెరువులు, నీటికుంటల్లో నీరు చేరడంతో అటుగా వెళ్లరాదని సూచించారు. వీడకుండా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు, తాగడం, వేడి ఆహారం భుజించడం, అస్వస్థతగా ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించడం చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలను, సపోర్టింగ్ వైర్లను తాకరాదని సూచించారు.



రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికుల పాట్లు



విఆర్.పురంలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు



దేవీపట్నంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ఇనుకొండ వాగు

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఈ నెల 9న ఆదివాసీగిరిజన సంఘం, ఆదివాసి జెఎసి ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసీ జెఎసి జిల్లా కన్వీనర్ వంతు బాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఆదివాసీ సంఘాల నేతలు, గిరిజన ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజవొమ్మంగిలో పార్టీలు, కులమతాలకు అతీతంగా నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో జెఎసి నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో ఆదివాసి జెఎసి నేతలు, ఉద్యోగ ఉపాధ్యాయులు వజ్రపు అప్పారావు, తొంట ఆదినారాయణ, కొండ్ల సూరిబాబు చీడి శివ, దాసరి పైడిమల్లు, పి రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ మహానేతల నివాళికి తరలి రండి

రంపచోడవరం : ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రంపచోడవరం ఆదివాసీ భవన్ వద్ద ఆదివాసీ మహానేతలకు నివాళులర్పించే ప్రత్యేక కార్యక్రమాన్నిఆదివాసీ (గిరిజన)ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం, జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిఆపరు. ఆదివాసీ హక్కులు చట్టాలు సాధన, పరిరక్షణకు పోరాడి అమరులైన ఆదివాసీ ఉద్యమ మహానేతలు బాతురెడ్డి .బాలురెడ్డి, పూసం.వెంకటేశ్వర్లు దొర,.కారం గంగరాజు దొర, అలాగే ఆదివాసీ పోరాట యోధులు కారం.తమ్మన్న దొర,.కొమురం భీమ్,బిర్సా.ముండా, పల్లాల అంబులురెడ్డిలకు నివాళులర్పించడంతోపాటు ప్రస్తుత పోరాట యోధులు, ఉద్యమ నాయకులను సత్కరిస్తామన్నారు. రంపచోడవరం,చింతూరు డివిజన్ 11 మండలాల్లోని ఆరు ఆదివాసీ తెగల ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమక్షంలో ఉదయం.10 గంటలకు ఆదివాసీ జెండాను ఉద్యమ నాయకులు ఆవిష్కరిస్తారన్నారు. ఆదివాసీ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల.ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కురసం ఫకీరు దొర, కోశాధికారి తాడే.రాజబాబు,వ మట్ల.కృష్ణారెడ్డి, కుంజం.అగ్గి దొర, సహాయ కార్యదర్శి ,విండెల.కృష్ణారావు ఉపాధ్యక్షుడు గంటిమల్ల. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొరగా పొట్టి దొర తెలిపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: : తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మారేడుమిల్లి మండల కూటమి నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా టిడిపి మండల అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, జనసేన మండల అధ్యక్షుడు మళ్ళా దుర్గాప్రసాద్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి మండలంలోని పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దష్టి సారించాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల ధ్యక్షుడు భీసెట్టి అప్పాజీ, మండల ఉపాధ్యక్షుడు క్రరి సన్యాసిరెడ్డిపాల్గొన్నారు.



మంత్రి దుర్గేశ్‌ను సత్కరిస్తున్న మారేడుమిల్లి కూటమి నేతలు



హుకుంపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జిఒ 3, ప్రత్యేక డిఎస్‌సిపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని బంగారుమెట్ట పంచాయతి మాలగుమ్మి గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కే నర్సయ్య ఆధ్వర్యంలో ముందస్తుగా బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఆవిష్కరణను గ్రామ పెద్ద కొర్ర బేన్ను చేతులు మీదుగా చేశారు.ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జీవో 3కు చట్టబద్ధత కల్పించి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఆదివాసి హక్కులు, చట్టాలను పాలకులు అమలు చేయలేదన్నారు.గిరిజన స్పెషల్ డిఎస్‌సితోనే ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కే.శ్రీను, కే బాలన్న, దేవన్న, కె.గసన్న, చిట్టిబాబు, జానకిరామ్, కృష్ణారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతపల్లి:ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో 3కు చట్టబద్ధత కల్పించడంతో పాటుగా ఏజెన్సీ ప్రాంత గిరిజనుల ప్రత్యేక డీఎస్సీపై స్పష్టత కల్పించాలని ఆదివాసి మాతృ బహు భాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాంగి శ్రీను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఏజెన్సీ ప్రాంతంలో శత శాతం ఉద్యోగాలు ఆదివాసులకే కల్పించాలని కోరారు.

హుకుంపేట:మండలంలోని మట్టుజోరు పంచాయితీ ముల్లుమెట్ట, మెరక చింత పంచాయతీ రంగ సింగపాడు తదితర గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు పర్యటించి హక్కులు, చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న హక్కులు, చట్టాలపై రక్షణకై రాజకీయ పార్టీలు గొంతు విప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సోమన్న, లింగమూర్తి, ఆనంద్, కోటి నూకరాజు, ఎన్.మూర్తి, బాలాన్న, ఈశ్వరి, నిరాజ తతలు పాల్గొన్నారు

సిపిఎం సర్పంచ్ చొరవతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గసభ పంచాయతీ కుసుమ కేంద గ్రామంలో స్థానిక పంచాయతీ సర్పంచ్ చొరవతో తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ చేపట్టారు.తాగు నీరు ట్యాంక్ నుండి వీధిలో ఉన్న కుళ్ళాయిలకు నీరు సరఫరా కాలేదని కుసుమ కేంద గ్రామస్తులు స్థానిక ఆ పంచాయితీ సిపిఎం సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన ఆమె వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేసి కొత్త ట్యాపులు అమర్చి తాగు నీరు సరఫరాను పునరుద్ధరించారు. వారం రోజులుగా విపరీతంగా వర్షాలు కురవడంతో వాటర్ ట్యాంక్, కుళాయిలు మరమ్మతుకు గురవడంతో తాగునీరు సరఫరా కాక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమ్మత్తు చేసి తాగునీటి సౌకర్యం పునరుద్ధరించడంతో సర్పంచ్ సునీతకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సీజన్ లో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన వేడి నీరు మాత్రమే ఉపయోగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ సర్పంచ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డుమెంబర్ పి.సత్యనారాయణ, గ్రామస్తులు రవి, సొంబ్రు, తదితరులు పాల్గొన్నారు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

మ్యుటేషన్లు వేగవంతం చేయండి

-జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తహసిల్దార్లను, సబ్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, విఆర్‌ఓ లాగిన్, తహసిల్దార్ లాగిన్ లో పెండింగ్ ఉన్న మ్యుటేషన్లపై ఆరా తీసారు. మ్యుటేషన్ ప్రక్రియ 30 రోజులలో పూర్తీ చేయాల్సి ఉందని, పెండింగ్ పెట్టడంపై కలెక్టర్ దిశానిర్దేశం చేసారు. వివిధ కారణాలతో తిరస్కరిస్తే అవి సబ్ కలెక్టర్ లాగిన్‌కు వెళ్తాయని, తహసిల్దార్ నిర్ణయాన్నే సబ్ కలెక్టర్ ఆమోదిస్తే నెల రోజులలో డిఆర్‌ఓకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. చాలా మండలాలలో ఎటువంటి నోటీసు లేకుండా ఇష్టానుసారంగా మ్యుటేషన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వాటిపై సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఏజెన్సీలోని ప్రభుత్వ నిబంధన ప్రకారం భూ సమస్యలను పరిష్కరించాలని, వారసత్వ భూములకు వారి కుటుంబ సభ్యులకు రికార్డుల ప్రకారం భూములు మార్పిడి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో తహసిల్దార్లు అఫిడవిట్ అడగరాదని ఆదేశించారు. కుల ధృవీకరణలు పక్కాగా పరిశీలించాలన్నారు.

అనంతరం ఎంపిడిఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్ఆర్‌జిఎస్ కింద మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలన్నారు. తక్కువ వేతనదారులు, జీరో వేతనదారులు ఉన్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు ప్రాధాన్యత నిచ్చి వంద రోజులు పని కల్పించే విధంగా సెల్ఫ్ అఫ్ వర్క్స్ తయారుచేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. మలేరియా ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, మలేరియా మరణాలు సంబవిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలోని గ్రామాలలో ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసి ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ ప్రశాంత కుమార్, చింతూరు పిఓ వి. చైతన్య, పంచాయతి అధికారి కొండలరావు, డివిజినల్ పంచాయతి అధికారి పిఎస్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

టాటా పవర్ సోలార్‌లకు ఆదరణ

ప్రజాశక్తి -అరకు లోయ రూరల్:టాటా పవర్ సోలార్ కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని టాటా పవర్ సోలార్ స్టేట్ హెడ్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అరకులోయ ఓ ప్రైవేట్ హెూటల్లో హెూటల్స్, రిసార్ట్స్, లాడ్జిల్లా ఓనర్లు, ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశంలో గత 32 సంవత్సరాల నుండి ఇప్పటి వరకు ఒక లక్ష 30 వేల పైగా ఒక్కొక్క గృహ వినియోగదారులకి 78 వేల సబ్సిడీతో అందించామన్నారు. ఏపీఈపిడిసిఎల్ ఏడి సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ ఉపయోగానికి రాయితీతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మూడు కిలో వాట్స్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 78 వేల రాయితీ ఇస్తుందన్నారు.

ఎస్బిఐ అఫీషియల్ అటకేష్ మాట్లాడుతూ, టాటా పవర్ షోల్డర్, ఎస్బిఐ సంయుక్తంగా సోలార్ సూర్యశక్తి అనే ప్రోగ్రాం కింద కమర్షియల్ వారికి 80 శాతం బ్యాంకు లోను ఉందన్నారు. ఈ కార్య క్రమంలో టాటా పవర్ సోలార్ ప్రతినిధి సాయికుమార్, ఏపీఈపిడిసిఎల్ ఏఈఈ సత్యనారాయణ, మహవీర్ ఇంజనీరింగ్ టాటా పవర్ సోలార్ ఛానల్ పార్ట్నర్ గోపాల్ రెడ్డి, టాటా పవర్ సోలార్ డీలర్ లక్ష్మి, అరకులోయ రిసార్ట్స్ హెూటల్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంటీఆర్ సాంబయ్య, రిసార్ట్స్ ఓనర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



సీమంతాలు చేస్తున్న జెసి, పిఒ

ప్రజాశక్తి-పాడేరు: తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆర్యోగం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ తెలిపారు. ఐసిడిఎస్ పథక సంచాలకులు పి. సూర్యలక్ష్మి అధ్యక్షతన ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశువు పుట్టిన దగ్గర నుండి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలని చెప్పారు. తల్లిపాలతో మానసికంగా, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతాయన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు తేనె, నీళ్ల వంటివి పడుతుంటారని అలా చేయడంతో బిడ్డ అనారోగ్యానికి గురువుతారని అన్నారు. ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రతీ పల్లెలోను తల్లిపాల ఆవశ్యకతపై చర్చ జరగాలన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు. బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు పట్టకపోతే చిన్నపిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐసిడిఎస్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న టేక్ హెూం రేషన్‌ను గర్భవతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రసవ సమయానికి వారం రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు.

ఐసిడిఎస్ పిడి పి.సూర్యలక్ష్మి మాట్లాడుతూ, ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు గ్రామ, మండల స్థాయిలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గర్భవతులు పండ్లను తినాలని చెప్పారు. పుట్టిన బిడ్డకు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టాలన్నారు. రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు బిడ్డలకు తల్లిపాలు పట్టాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు వ్యతిరేకించాలని సూచించారు. మత్తు పధార్థాలకు, గంజాయికి గిరిజన కుటుంబాలు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ముందుగా గర్భవతులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట పిహెచ్.సి వైద్యాధికారి మోహన్ సాయి, వైద్యులు రాణా ప్రతాప్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్ఐ. డి.శకుంతల పాడేరు సిడిపిఓ ఝాన్సీ, సిడిపిఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో బుధవారం వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేస్తూ అవగాహనా కల్పించారు, అనంతరం వైద్యాధికారి నిఖిల్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమతంగా ఉండాలన్నారు. సికిల్ సెల్ అనిమియా, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక : బిడ్డకు తల్లి పాలు ఆరోగ్యమని గౌరీదేవిపేట పిహెచ్‌సి డాక్టర్ శ్రీదేవి అన్నారు. బుధవారం చలంపాలెం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, పుట్టినప్పుడు ముర్రిపాలు ఇవ్వడంతోపాలు బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని సూచించారు. దీని వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. అమ్మపాలు తాగే శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, రోగనిరోధక శక్తిని పొందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ వి లక్ష్మీ,వాణి అంగన్వాడీ కార్యకర్తలు,తల్లులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : తల్లిపాలు విశిష్టతను ప్రతి తల్లి గుర్తించాలని రాజవొమ్మంగి సిడిపిఒ దేవమణి అన్నారు, బుధవారం రాజవొమ్మంగి అంగన్వాడీ 2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల భాగంగా తల్లిపాలు విశిష్టతపైఅవగాహన సదస్సు నిర్వహించారు,ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు, బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలింతలకు పోషకాహార కిట్లను అంద జేశారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి సెక్టార్ సూపర్వైజర్ అరుణలత, మహిళా పోలీస్ విజయ కుమారి, అంగన్వాడి వర్కర్లు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎటపాకలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి



మాట్లాడుతున్న ప్రకాష్‌బాబు

దత్తత గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : జిల్లా న్యాయసేవాధికార సంస్థ దత్తత తీసుకున్న రాజవొమ్మంగి మండలం అమీనాబాద్ కాలనీ, అడ్డతీగల మండలం డి పోరవరప్పాడు గ్రామాల్లో సందర్శించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించినట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చైర్మన్ కె ప్రకాష్‌బాబు తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల చైర్మన్ల ఆదేశాల మేరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలను కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఆయా గ్రామాల సందర్శనలో భాగంగా అక్కడి పరిస్థితులను పరిశీలించారు రహదారి, తాగునీరు, వంటి మౌలిక సౌకర్యాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పోలవరప్పాడు గ్రామానికి రూ.90 లక్షల వ్యయంతో వేసిన 2.50 కిలోమీటర్ల మెటల్ రోడ్డు ఏడాది కాకుండానే అధ్వానంగా తయారవ్వడంపై విస్మయం వ్యక్తం చేసిన ప్రకాశ్‌బాబు, దీనిపై రోడ్డు వేసిన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నపాటి తగాదాలను గ్రామపరిధిలోనే పరిష్కరించుకోవాలన, సమిష్టిగా గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. రంపచోడవరం ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ పి బాబు, న్యాయవాదులు శ్రీధర్ రమణ, గౌరీ శంకర్, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, లలితాశ్రీ, అమీనాబాద్ సర్పంచ్ కించు వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చంటి పిల్లల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి-చింతూరు: ఇటీవల కాలంలో చింతూరు డివిజన్‌లో సంభవిస్తున్న చిన్న పిల్లల మరణాలను దృష్టిలో ఉంచుకొని, వాటి నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికతో తగు చర్యలు తీసుకుంటున్నట్లు చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య వెల్లడించారు. ఈ మేరకు అన్ని గ్రామాలలోని చంటిపిల్లల ఆరోగ్య పరిస్థితుల పర్యవేక్షణకు క్షేత్ర స్థాయిలోకమ్యూనిటి హెల్త్ ఆఫీసర్స్, మహిళా, పురుష ఆరోగ్య కార్యకర్తల ద్వారా 0 నుంచి 1 సంవత్సరం లోపు వయస్సు ఉన్న పిల్లలందరి గృహాలు సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తారన్నారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి మొదలై శనివారం లోపల పూర్తి చేయాలని ఆదేశించారు ఈ మేరకు 139 మంది వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది పనిచేస్తారనిన్నారు.వర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకొని గోదావరి నది పరివాహక గ్రామాల్లో, గుట్టల మీది గ్రామాల సందర్శన కూడా వీలున్నంత త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సందర్శనలో భాగంగా ఆయా ఇళ్లలో అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, అవసరాన్ని బట్టి వారిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడం, అక్కడ వైద్యాధికారి పరిశీలించి తగు చికిత్స అందించేలా చర్యలు చేపడతారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే చింతూరు లేదా కూనవరం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు పంపించి అక్కడ పిల్లల వైద్య నిపుణులతో కావలసిన రక్త పరీక్షలు చేయించి, వైద్యసేవలు అందిస్తారన్నారు. ఇంటింటి పిల్లల ఆరోగ్య సర్వే కార్యక్రమం పూర్తయిన వెంటనే, గ్రామ సచివాలయ పరిధిలో పిల్లల సంఖ్యను బట్టి సోమవారం నుంచి వైద్యాధికారితో ఒకటి లేదా రెండు క్యాంపులు ఏర్పాటు చేసి, పిల్లందరికీ ఆరోగ్యపరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

తెలుగు భాష ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:తెలుగు భాషను పరిరక్షించుకుందామని రిటైర్డ్ రసాయన శాస్త్ర అధ్యాపకులు కొయిలాడ రామ్మోహన్, జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు భాష పై అవగాహనను బుధవారం కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగు వెలుగును అందరికి పరిచయం చేయాలన్నారు. జిల్లాలోని అనేక పాఠశాలలో కళాశాలలు సందర్శించి అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి - సీలేరు: ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై చిత్రకొండ ఒపిహెచ్ పిసి కార్యాలయంలో రెండు రాష్ట్రాల జలవనరుల విభాగం రాష్ట్ర అధికారులు బుధవారం సమావేశమే చర్చించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బలిమెల జలాశయంలో 1487.90 అడుగులు నీటిమట్టం చేరుకోగా, బలిమెలలో 48.3825 టీఎంసీలు, జోలాపుట్ రిజర్వాయర్‌లో 2738.90 అడుగుల నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇక్కడ 22.1459 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బలిమెల జలాశయంలో ఈనెల చివరి నాటికి 22 టీఎంసీలు, జోలాపుట్‌లో 10.40 టిఎంసిలు నీరు వచ్చి చేరుతుందని లెక్కలు కట్టారు. బలిమెల, జోలాపుట్ రెండు రిజర్వాయర్లతో మొత్తం103.5284 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఏపీ వాటా 53.8407 టీఎంసీలుగా ఒడిశా వాటా 49.6877 టీఎంసీలుగా పంపకాలు చేశారు. 2025 -24 జులై నెలలో ఒడిశా 7.6755 టీఎంసీలు, ఆంధ్ర తన వాటాగా 3.5225 టిఎంసిలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఆంధ్ర కంటే ఒడిశా 4.5558 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్రా అధికారులు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ మేరకు ఆంధ్రకు వేయి క్యూసెక్కులు, ఒరిస్సాకు 3100 క్యూసెక్కుల నీటిని ఇరు రాష్ట్రాలు వినియోగించుకోవడానికి అధికారులు అంగీకరించారు.కార్యక్రమంలో ఒరిస్సా పొట్టేలు ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పితాబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఇ రమాకాంత్ పాత్రో, ఎత్తడం డివిజన్ ఎఇఇ తుసర్ రంజన్ కుంతే, ఎఇఇ గడాదర్ ప్రధాన్, ఆంధ్ర తరపున ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఇన్చార్జి ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇఇ వెంకట మధు, ఎఇఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రకొండలో సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు ఏకలవ్యలో నీటి తగాదా

సమస్యపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం ఏకలవ్య పాఠశాలలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. బుధవారం పాఠశాలను సందర్శించిన తల్లిదండ్రులు బృందం అక్కడి సమస్యలను పరిశీలించింది. ఇటీవల నీటిగొడవతో ఇంటర్ సెకెండియర్ విద్యార్థుల వేధింపులతో ఫస్టియర్ విద్యార్థి పాఠశాలను వదిలి ఇంటికి వెళ్లిపోయిన ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, పాఠశాలకు ఒక్క ట్యాంకు ఉండడం వలన మంచినీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలోనే ఇంటర్ ఫస్ట్, సెకెండియర్ విద్యార్థులకు ఒక రూమ్‌లో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. సెకెండియర్ విద్యార్థులు పెట్టిన వేధింపులకు ఫస్టియర్ విద్యార్థి పాఠశాలను వదిలిపోయే ఘటన చోటుచేసుకుందని, ఇంత జరుగుతున్నా పాఠశాల యాజమాన్యం ఏం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు నీటికోసం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల మధ్య వివాదం తీవ్రం కాకముందే జిల్లాకలెక్టర్ తగు చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు, విద్యార్థుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, పాఠశాలలో సామరస్య వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు.

పాఠశాలల మూసివేతపై పునరాలోచించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పెదబయలు :రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలు మూసివేయాలన్న నిర్ణయం పై పునరాలోచన చేయాలని అల్లూరి జిల్లా యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.శేసగిరి బుధవారం తెలిపారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, పని సర్దుబాటు పేరుతో పదిమంది ఉన్న ప్రాథమిక పాఠశాలలను ముసి వేసేందుకు ఆలోచించడం అనాలోచిత నిర్ణయమన్నారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ విద్యారంగం బలహీనమైందన్నారు. బోధనేతర యాప్‌లు, పనిబారం తగ్గించాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగాన్ని మెరుగుపరిచలన్నారు పదవి విరమణలో ఖాళీగా పోస్టులందు నూతన నియమాలు చేపట్టాలన్నారు, ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో పాఠశాలలను ముయించార్దన్నారు గత రెండూనెలల క్రితం ఉపాధ్యాసంఘాలు ప్రభుత్వం తో చర్చలు జరిపి తాత్కాలిక విరమణ అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో రెండూనెలల తరువాత చర్చలు జరుపుతమని చెప్పి నేటికీ పిలుపు రాలేదన్నారు, రద్దు చెయ్యాలన్నారు, లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈకార్యక్రమంలో ఎస్, టి,యు ప్రధాన కార్యదర్శి గిడ్డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

కెజిహెచ్ ఎఒగా మంగరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి పరిపాలనా అధికారిగా ఎస్.మంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను కలిసి విధుల్లో చేరారు. ఇప్పటివరకు నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్య కళాశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన తాజాగా కెజిహెచ్‌కు వచ్చారు. ఆయన గతంలో కెజిహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, వేదికపై సిహెచ్.నర్సింగరావు తదితరులు

పోటీ పరీక్షల్లో ప్రతి మార్కూ కీలకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోటీ పరీక్షలలో ప్రతి మార్కు అత్యంత ప్రధానమైనదని, మెగా డిఎస్‌సి, టెట్ వంటి పోటీ పరీక్షలలో నెగ్గాలంటే కేవలం చదివితేనే సరిపోదని, లోకజ్ఞానం కూడా ఉంటేనే విజయం సాధించవచ్చునని ప్రముఖ కోచింగ్ నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మెగా డిఎస్‌సి, టెట్ పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో వచ్చే ప్రశ్నలకు సంబంధించి ఉద్యోగార్థులు అదే పనిగా సంబంధిత పాఠ్యాంశాలను చదువుతూ ఉంటారని తెలిపారు. అయితే ఇటువంటి పోటీ పరీక్షలలో పాఠ్యాంశాలకు సంబంధించిన పరిస్థితులతో పాటు వాటికి సంబంధం లేని లోకజ్ఞానానికి సంబంధించిన అంశాలపై కూడా ప్రశ్నలు ఉంటాయన్నారు. రాజ్యసభ సభ్యునిగా ఉండి తొలిసారిగా భారతదేశ ప్రధానమంత్రి పదవిని పొందిన వారు ఎవరు ?, ఎన్నికల వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటుకు నేటి వరకు జరిగిన 18 ఎన్నికలలో ఒకే గుర్తుపై ఎన్నికల బరిలో నిలిచిన పార్టీ ఏది.. ? వంటి ప్రశ్నలు పాఠ్యాంశాలలో కనిపించవని, నిత్యం పత్రికలను అధ్యయనం చేయటం వల్ల, లోకజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడం వల్ల మాత్రమే అటువంటి ప్రశ్నలకు సమాధానం లభిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలలో ఒకే ఒక్క మార్కు తేడాతో అనేక మంది అభ్యర్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతున్న విషయం తెలిసిందేనన్నారు. అంతమాత్రాన నిరాశ చెందకూడదని, మరొక అవకాశం కోసం అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. పేదరికంతో ఇబ్బంది పడే అభ్యర్థులకు తాము శిక్షణ ఇస్తామని, దానికి ఎటువంటి ఖర్చు ఉండదని భరోసా ఇచ్చారు. అటువంటి అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 160 పేజీల విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పారిశ్రామికవేత్త, సామాజిక సేవకులు డాక్టర్ పికె.జోష్ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర మెటీరియల్ బుక్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో, రాష్ట్రంలో చదువుకున్న విద్యావంతులకు కొదవ లేదన్నారు. అయితే వారికి ఉపాధి మాత్రం దొరకడం దుర్లభంగా ఉందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రైట్ టు వర్క్ విధానం ఉంటే నిరుద్యోగం ఉండదన్నారు. చైనా వంటి సోషలిస్టు దేశంలో ఆ విధానం అమలులో ఉందని, అక్కడ నిరుద్యోగం సమస్య లేదని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఆ దేశంలో ఉపాధి గ్యారెంటీ అన్నారు. మనదేశంలో అధికారంలో ఉన్న పాలకుల విధానాల కారణంగా చదువుకున్న విద్యావంతులకు సైతం ఉద్యోగాలు రావటం లేదని తెలిపారు. అందరికీ పని దొరికితేనే దేశం బాగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.సతీష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, నాయకులు ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేయవద్దని పోర్టులోని అన్ని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పోర్టులో అన్ని కార్మిక సంఘాల నాయకులూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిపిపితో తలెత్తే పరిణామాలను వివరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రామలింగేశ్వరరావు, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.సత్యనారాయణ, బి.లక్మణరావు, ఎఐటియుసి అనుబంధ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి డికె.శర్మ, సిఎఫ్‌టియు జాతీయ అధ్యక్షులు ఎన్.కనకరావు, ఐఎన్‌టియుసి అధ్యక్షులు చందు, వర్కర్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.